క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంపీ రఘునందన్‌రావు



చెక్కు అందజేస్తున్న ఎంపీ

తొగుట(దుబ్బాక): ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గుడికందుల గ్రామానికి చెందిన ఎల్లారెడ్డికి మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

విజేతగా విద్యార్థిని



హేమ

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని హేమ ఆన్‌లైన్ చిత్ర లేఖనం పోటీల్లో విజేతగా నిలిచినట్లు హెచ్‌ఎం విఠల్ గురువారం తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో 15న నిర్వహించే సాంస్కృతికోత్సవంలో విద్యార్థినికి నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఆమెను ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో కలిసి అభినందించారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం: బీఎస్పీ



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రైతు బజారు, మినీ ఫంక్షన్ హాల్ పనుల్లో నాణ్యత లోపించిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు మార్కెట్ కార్యదర్శి ప్రభాకర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రూ.3కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భవనానికి కొన్ని చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయని వాపోయారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి సర్టిఫికెట్ ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్, నాయకులు శంకర్, సుధాకర్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ

మర్కూక్(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎస్‌ఐ దామోదర్ అన్నారు. మండలంలోని ఎర్రవల్లిలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులు మంచి ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, మండల స్పోర్ట్ క్లబ్ చైర్మన్ కృష్ణ, నాయకులు బాల్‌రాజు, మల్లేశం, యాదగిరి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ఆర్ పనుల్లో నిర్లక్ష్యం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగానే రీజినల్ రింగు రోడ్డు(ట్రిపుల్ఆర్) పనుల్లో స్తబ్ధత నెలకొన్నదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిలో కీలకంగా మారనున్న ట్రిపుల్ఆర్‌పై నిర్లక్ష్యం వీడి పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని వాపోయారు. ప్రత్యేకించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం రోజురోజుకూ పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రుణమాఫీ, రైతు బంధు అంశాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలును ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని, ప్రజల మద్దతుతో కాంగ్రెస్ విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రజలు, ప్రభుత్వానికి ఆర్పీలు వారధులు

- అందని జీతాలు.. ఎన్నో సమస్యలు
- జీఓ 164 రద్దుకు డిమాండ్
- ఆర్పీల సంఘం రాష్ట్ర నేత శ్రీమతి



సిద్దిపేటజోన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో మున్సిపల్ మెప్మా ఆర్పీలు వారధులుగా పనిచేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించి అండగా నిలవాలని రాష్ట్ర పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ, మెప్మా ఆర్పీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంకణాల శ్రీమతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలో మెప్మా విభాగంలో ఆర్పీల పాత్ర చాలా కీలకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఆరు వేల మంది మెప్మా పరిధిలో పని చేస్తున్నారని, గత ప్రభుత్వం తెచ్చిన జీఓ 164ను రద్దుచేసి వీఓఏ తరహాలో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ అంశంపై రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, ఇతర మంత్రులకు వినతిపత్రాలు అందజేశామని చెప్పారు. ప్రతి నెలా ఆర్పీలకు సక్రమంగా గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో ప్రభుత్వ అధికారుల కంటే ఎక్కువగా పనిచేస్తున్నారని, అది గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఇచ్చే గౌరవ వేతనం కూడా ఐదు, ఆరు నెలలకు ఒక్కసారి ఇవ్వడం వల్ల పండుగ పూటకూడా వేతనం కోసం పోరాటం చేసే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనిధి, వీఎల్ఆర్ నుంచి వేతనాలు తీసుకునే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి న్యాయం చేయాలని కోరారు.

నేత్రపర్వం.. దీపోత్సవం



నాచగిరిలో కార్తీక సహస్ర దీపోత్సవానికి తులసి కోట వేదికైంది. ఆరో రోజైన గురువారం రాత్రి దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. దివ్వెల వరుసలతో శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధానం కాంతులీనింది. ఈ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తీక జ్యోతులు వెలిగించారు. ఆలయ సిబ్బంది, పురోహితులు అన్ని ఏర్పాట్లు చేశారు. - వర్గల్(గజ్వేల్)

రహదారులపై ధాన్యం.. ప్రమాదకరం

ఏసీపీ మధు



రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ మధు, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై ధాన్యం పోయవద్దని ఏసీపీ మధు పిలుపునిచ్చారు. సిద్దిపేట-వరంగల్ రహదారిపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, సిబ్బందితో కలిసి గురువారం ఆయా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాలు అదుపుతప్పి, ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వరిధాన్యం పక్కన పెడుతున్న రాళ్లను రాత్రి వేళల్లో ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులపై వరిధాన్యం పోయవద్దని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కథ, కవితల పోటీల్లో ఉత్తమ ప్రతిభ



రక్షిత

సిద్దిపేటరూరల్: ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన కథ, కవితల పోటీల్లో నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన ఏడోతరగతి విద్యార్థిని దుర్గం రష్మిత ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. 15న దేవులపల్లి కళామందిర్ సారస్వత పరిషత్తులో జరిగే సన్మాన కార్యక్రమంలో రిష్మితకు బహుమతితో పాటుగా ప్రశంసాపత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

దుబ్బాక: యువత తప్పనిసరిగా ఓటరు నమోదు చేయించుకోవాలని, అందు కోసం 9, 10వ తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి అబ్దుల్ హమీద్ తెలిపారు. పట్టణంలోని సమీకృత కార్యాలయ భవనంలో తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 యేళ్లు నిండిన వారికి తప్పకుండా ఓటుహక్కు కల్పించేలా చూడాలన్నారు. ఓటు విలువను తెలియజేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. అలాగే దుబ్బాకలో కొనసాగుతున్న సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన సర్వే, ధాన్యం కొనుగోళ్ల తీరుతెన్నులపై సమీక్షించారు. కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు పకడ్బందీగా జరిగేలా ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు అందరి సహకారం అవసరం

ఎంపీడీఓ వెంకటేశ్వర్లు



కొండపాక(గజ్వేల్): సర్వే గురించి వివరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కొండపాక(గజ్వేల్)/సిద్దిపేటకమాన్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. సిర్సనగండ్ల గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ప్రతీ ఇంటికి స్టిక్కరువేసే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో ఇంటింటా తిరుగుతూ సర్వే గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కులగణనలో తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్వే సూపర్‌వైజర్ బాలకిషన్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. అదే విధంగా సిద్దిపేట 34, 35వ వార్డుల్లో ఇంటింటికి స్టిక్కర్లు అతికించే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. సర్వేను సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంధ్య శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉండొద్దు

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



సిద్దిపేటజోన్: కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఏఓ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని రేగులపల్లెలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌డీఓ పీడీ జయదేవ్ ఆర్య, డీఎస్‌ఓ తనూజ గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ, తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు పంపాలని సూచించారు. అన్ని మిల్లులలోను సేకరణ జరుగడం లేదని నిర్వాహకులు వారి దృష్టికి తీసుకొచ్చారు. వారి వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, సూరింటెండెంట్ అంజయ్య, సీసీ సారయ్య, వీఏఓ నాగలక్ష్మి, కార్యదర్శి జీవన్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి: ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటజోన్: ధాన్యం అమ్మకంలో రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచించారు. సిద్దిపేటలోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చే ధాన్యం తేమశాతం 17లోపు ఉండేలా చూడాలని చెప్పారు. రంగుమారిన, మొలకెత్తిన, పురుగుపట్టిన ధాన్యం 5శాతంలోపు ఉండాలని, గింజ గట్టిపడనివి 3 శాతంలోపు ఉండాలని, నాణ్యత లేని గింజల మిశ్రమం 6 శాతం వరకు ఉంటే కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పంట కోసిన తర్వాత ఆరబెట్టుకోవాలని, ఒక రకం ధాన్యాన్ని మరో రకం ధాన్యంలో కలవకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ శ్రీకాంత్ ఉన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



పంటను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగులో సరైన మెలకువలు పాటిస్తే అధిక లాభాలు పొందొచ్చని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. మండలంలోని చాట్లపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్‌పామ్ సాగు ఒకటే పరిష్కారమన్నారు. నాలుగో సంవత్సరం దిగుబడి ప్రారంభమై 30 యేళ్ల వరకు ప్రతి నెల రెండు కోతలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఉంటాయని, అలాగే ప్రభుత్వం కూడా సబ్సిడీ అవకాశం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చరల్ అధికారి సౌమ్య, ఏఈఓలు విజయ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ బోయిని పరశురాములు తెలిపారు. గ్రామానికి చెందిన గున్నాల కనకరాజు(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత 6న మండల పరిధిలోని చెప్యాల గ్రామంలో ఉంటున్న తన చెల్లెలికి బంధువుల పెండ్లి పత్రిక ఇచ్చి బైకుపై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మిరుదొడ్డి శివారులోని బొమ్మరాజు చెరువుకట్టపై అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో స్థానికులు అతడిని దుబ్బాక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. లింగారెడ్డి గ్రామ శివారులో రెండు రోజుల క్రితం ఆగి ఉన్న బస్సును తన బైకుతో ఢీ కొన్న ఘటనలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు ఆయన చెప్పారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో 9మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.14వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మూడు రోజుల్లో పరిష్కరించండి

అదనపు డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: దరఖాస్తును మూడు రోజుల కంటే ఎక్కువ పెండింగ్ పెట్టవద్దని అదనపు డీసీపీ మల్లారెడ్డి ఆదేశించారు. 2.0 నూతన అప్లికేషన్‌పై సిబ్బందికి గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎస్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలన్నారు. మూడు రోజుల్లో దరఖాస్తును పూర్తి చేయాలని సూచించారు. పీఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారులను గౌరవించాలని, ఐటీ కోర్ సీఐ శ్రీధర్‌గౌడ్ 2.0నూతన వెర్షన్‌పై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, రాజిరెడ్డి, స్వామి, రమేశ్, స్వప్న, హరి తదితరులు పాల్గొన్నారు.

రెండు వేల మందికి దుస్తుల పంపిణీ

రేపు ఘనంగా సీఎం రేంవత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



గజ్వేల్‌రూరల్: ఆవాలతో రేవంత్‌రెడ్డి చిత్రపటం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/గజ్వేల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, 37వ వార్డు కౌన్సిలర్ సాకిబాల్‌లక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు వేల మంది పేదలు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు హాజరుకానున్నారని, మధ్యాహ్నం ఒంటిగంటకు అంబేడ్కర్ చౌరస్తా నుంచి యాక్సిస్ బ్యాంక్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రియాజొద్దీన్, ఎల్లం యాదవ్, అత్తు ఇమామ్, గయాజొద్దీన్, మధు, నజ్జు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. సీఎం జన్మదినం సందర్భంగా గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆవాలతో సీఎం రేవంత్‌రెడ్డి రూపాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ మాట్లాడారు. రాములు, సాధిక్‌పాష, బాలు, సురేశ్ పాల్గొన్నారు.

మంత్రి సురేఖకు చిత్రపటం అందజేత



చిత్రపటాన్ని అందజేస్తున్న సతీశ్‌కుమార్

సిద్దిపేటకమాన్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్ గురువారం కలిశారు. ఉమ్మడి జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీసినట్లు ఆయన తెలిపారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి పాల్గొన్న చిత్రపటాన్ని మంత్రి సురేఖకు అందజేశామని సతీశ్ చెప్పారు. కార్యక్రమంలో రాహుల్‌గౌడ్, రోహిత్, రాజేశ్, సురేశ్, సాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు



ప్రశ్నపత్రాలను అందజేస్తున్న బాలరాజు, మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో పాఠశాల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించారు. కాకతీయ టెక్నో హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు ములుగు బాలరాజు, ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష సహకారంతో గజ్వేల్ మండల వ్యాప్తంగా జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 8, 9, 10వ తరగతుల నుంచి మొత్తం 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. 21న జరిగే మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరు కావాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్‌కు అంతరాయం

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని లింగాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 ఫీడర్‌లో మరమ్మతు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు చందాపూర్, లింగాపూర్, వెంకట్రావుపేట, బంజేరుపల్లి, రాంపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

◆ టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 22 వరకు హెచ్‌టీఎంఎల్5, సీఎస్ఎస్3, జావా ప్రోగ్రామింగ్‌లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు టెక్నికల్ ట్రైనర్ నరేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ లేదా డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 86880 89904ను సంప్రదించాలని కోరారు.

◆ మల్లంరాజు సంస్మరణ సభ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లంరాజు ఇటీవల మృతి చెందగా గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ ఎంపీపీ నాయిని యాదగిరి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తదితరులు మల్లంరాజుపై ప్రజా కళాకారుడు నర్సన్న రాసిన పాటల సీడీని మల్లం రాజు తల్లి కమలమ్మ, అతని భార్య సుమతితో కలిసి ఆవిష్కరించారు. వెంకట్‌రెడ్డి, శ్రీహరియాదవ్, రాంరెడ్డి, రాజిరెడ్డి, విరాసత్‌అలీ, మాదాసు శ్రీనివాస్, వెంకన్న, వేణు, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సేవలు వినియోగించుకోవాలి: సీఐ దుర్గ

సిద్దిపేటకమాన్: అత్యవసర సమయంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ బస్టాండ్, కోమటి చెరువు ప్రాంతాల్లో షీటీమ్, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌లను వాల్ పెయింటింగ్ వేయించామని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

◆ ఆదర్శ పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో 9వ తరగతి నుండి ఇంటర్‌మీడియెట్ వరకు పీజీటీ బోటనీ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేశ్ తెలిపారు. పీజీటీ బోటనీతో పాటు బీఈడీ ఉత్తీర్ణత ఉండాలని, ఆసక్తిగల వారు 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ నియంతృత్వ విధానాలపై పోరాడతాం

దుబ్బాక/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ విధానాలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. దుబ్బాక నాలుగో మహాసభలు సీతారాం ఏచూరి ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. భాస్కర్, శశిధర్, ప్రశాంత్, నవీన, కొంపెల్లి భాస్కర్, మల్లేశం, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండల 3వ మహాసభను పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని మండల కార్యదర్శి రవికుమార్ కోరారు. మహాసభల కరపత్రాలను సిద్దిపేటలో ఆవిష్కరించారు. సంజీవ్ కుమార్, బాలు, నరేశ్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో గురువారం కేశవ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగావైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరుణ చంద్రమౌళి, నాయకులు వెంకట్‌రెడ్డి ఉన్నారు.